

# మంచి కవితతో కొంచెంసేపు

## విన్నకోట రవిశంకర్



నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

## పడవ నిద్ర

**అధివాస్తవిక** ధోరణిలో కవిత్వం రాస్తున్న యువ కవుల్లో ఎమ్మెస్ నాయుడు కూడా ఒకరు. కవిత్వంలో నిర్దిష్టతనీ, వాక్యంలో అన్వయ సౌలభ్యాన్నీ నేను కోరుకొనే మాట నిజమేగాని, ఒక కవిలో ప్రాథమికమైన కవిత్వాంశ ఉన్నంత వరకూ, ఏ ధోరణి కవిత్వంతో నైనా నాకిబ్బంది లేదు. కవి తన కవిత్వం ద్వారా  సృష్టించగలిగిన కల్పానా ప్రపంచాల పరిధిని అదివాస్తవిక కవిత్వం విస్తరిస్తుంది. ఈ కారణం చేత కూడా నేను దాన్నిష్టపడతాను. నాయుడు తన పుస్తకానికి పేరు పెట్టటంలోనే వైచిత్రి చూపించాడు - "ఒక వెళ్ళిపోతాను" అన్నది  పేరు. ఈ అసంబద్ధ వాక్యం పుస్తకంలో ఏముందో తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగిస్తుంది. ప్రస్తుతం చర్చించబోయే కవిత ఈ పుస్తకంలోనిదే

ఇందులో పద్యాలు చదువుతున్నప్పుడు, ఈ కవి, అందకుండా అన్నివైపులకీ ఎగురుతున్న తూనీగలన్నిటినీ ఒకేసారి పట్టుకోజూసే పిల్లవాడిలా కనిపిస్తాడు. పద్యాలలోని వాక్యాలు ఒడ్డునపడి గిలగిలలాడుతున్న చిన్న  చేపపిల్లల్లా అనిపిస్తాయి. వాటిని జాగ్రత్తగా పొదివి పట్టుకొని, మన మనోకాసారంలో వదిలిపెట్టాకే, అవి చైతన్యం వచ్చి కదలాడతాయి. వాటిలో ఏవెంతవరకు మనగలుగుతాయన్నది కూడా మనమీదే ఆధారపడి ఉంటుంది.

కొత్తపదచిత్రాల్ని సృష్టించటంలో, పరస్పర విరుద్ధ మైన వాటిని కలిపి కొత్త అనుభవాన్ని కల్పించటంలో నాయుడు ప్రతిభ కనిపిస్తుంది. ఇతని కవిత్వంలో  జీవితం మృత్యువుని దానం చేస్తుంది, కన్నే కన్నీరు తుడుచుకుంటుంది, దుఃఖం మనసుని పిల్లై  గీరుతుంది, చంద్రుడిని చీమలు మోసుకెళ్తాయి. ఎత్తుపళ్ళ సముద్రం, కన్నీటి తేనెతుట్ట వంటి పదచిత్రాలు ఈ కవితల్లో విరివిగా దొరుకుతాయి.

నాయుడు ప్రదర్శించే భావనా వైచిత్రికి ఉదాహరణగా, మృత్యువు గురిచి వివిధ  కవితల్లో రాసిన వాక్యాలను తీసుకోవచ్చు. మృత్యువు గురించి అనేకమంది కవులు అనాదిగా రాస్తూనే ఉన్నారు. అది జీవితంలో తీసుకువచ్చే విషాదానికి స్పందించి రాసిన వారు కొందరైతే, దానిని నెచ్చెలిగా భావించి రాసిన వారు కొందరు. కాని, నాయుడు దానినొక అసహాయగా, పసిపాపగా భావించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

*మరొక పాల చుక్క కోసం*

*పెదవులు తెరుచుకొనుంది*

*మృత్యువు*

వేరే కవితలలో "నోరులేని మృత్యువు" అన్న వాక్యం, "మెత్తటి మృత్యువు" అన్న వాక్యం కూడా ఇటువంటివే. బాగా పరిచితమైన, పాతబడిన అంశాన్ని తీసుకొని, విభిన్నంగా చెప్పటం కవిత్వానికి ఒక గీటురాయి. అదే సమయంలో, కొన్ని వాక్యాలలో వైచిత్రి ఆకర్షించినా, అనుకొన్న ప్రభావాన్ని కలిగించలేకపోయే అవకాశం కూడా ఉంది. ఉదాహరణకు, "నాకింకా ఆత్మహత్య చేసుకొనే వయస్సు రాలేదు" వంటి వాక్యాలు. వయో పరిమితి ఉండటానికి ఆత్మహత్య చేసుకోవటం వోటు వెయ్యటం లాంటిది కాదు కదా. ఒక విషాద కవితలో ఈ వాక్యాలు విరుద్ధ భావాన్ని కలిగిస్తాయేమోనని నాకనిపిస్తుంది.

ఇందులో కుదురుగా ఉన్న పద్యాలలో "పడవ నిద్ర" కూడా ఒకటి. ఈ పద్యం అందంగా కేప్చర్ చేసి, చక్కగా పటం కట్టిన లాండ్స్కేప్ లాగా ఉంది. మిగతా పద్యాలతో పోల్చి చూసినప్పుడు, చేతికి దొరక్కుండా అన్నివైపులకీ పరుగెడుతూ దుమ్ములో ఆడుకొనే పిల్లల్ని, తయారు చేసి, తలదువ్వి, ఒక చోట కూర్చోబెట్టి తీసిన పోర్ట్రెయిట్ లాగా కూడా ఉంది. పడవ ప్రయాణంలో నిద్ర వచ్చి వాలటం సాధారణమైన అనుభవమే.
నిద్రను ఒక స్త్రీగా ఊహించిన ఈ కవిత ఎంతో హృద్యంగా సాగింది. పడవలో ఉన్న నిద్ర వాతావరణాన్ని నదికి ఆపాదించటం కూడా మంచి ప్రభావాన్నిచ్చింది.

*నీటి నిద్రలో*

*పడవ తేలుతూ*

*వేగంగా పోతూ*

ఆమె ఎక్కణ్ణించో రావటం, దగ్గరగా కూర్చోవటం, మాటల్లోకి జారటం, చివరకు ఇద్దరూ పడవ దిగి వెళ్ళిపోవటం - ఇలా వర్ణన మొత్తం చాలా సాధరిణీకరింపబడిందని చెప్పుకోవచ్చు. నిజానికి ఇందులో ఆమె ఎవరైనా కావచ్చు - నిద్ర, కవిత్వం, ఊహా ప్రేయసి, తాను కోల్పోయిన నిజ అంతరంగం - ఇలా పలు రకాలుగా చెప్పుకోవచ్చు. అసలు కవిత శీర్షిక "పడవ ప్రయాణం" అని పెట్టిఉంటే మరింత బాగుండేదని నాకనిపిస్తుంది. అప్పుడు, వివిధ రకాలుగా దీనికి అర్థం చేప్పుకొనే అవకాశం ఎక్కువగా ఉండేది.

ప్రస్తుతం మంచి కవిత్వం రాస్తున్న కవుల్లో నాయుడు కూడా ఒకరు. పద్యాన్ని భావించటంలో, ఒడుపుగా నిర్వహించటంలోనూ అతనికున్న నైపుణ్యానికి ఈ కవిత ఒక చక్కటి ఉదాహరణ.

కవిత పూర్తి పాఠం:

పరుగెట్టుకుంటూ వెళ్ళి
చిన్న పలచని చెక్కపడవలో
నీళ్ళల్లో కూర్చుంటాను

ఆమె ఎక్కడ్నించో వచ్చి
నన్నానుకుని ఎక్కడకో వెళ్తూవుంటాం

నీటి నిద్రలో
పడవ తేలుతూ
వేగంగా పోతూ

ఆమె మరీ దగ్గరగా
దగ్గరగా ఆమె మాటల్లోకి
నాలో పెరుగుతున్న జ్ఞాపకాల్లోకి

ఆకాశం రంగుల నీళ్ళల్లో
బరువు చెట్ల రంగుల్తో
మా ఇద్దరి కళ్ళతో

పడవ దిగి వెళ్ళిపోయాం

(ఎం.ఎస్.నాయుడు సెంట్రల్ యూనివర్సిటీలో ఫిలాసఫీ చదువుకున్నారు. "ఒక వెళ్ళిపోతాను" అనే కవితా సంకలనం వెలువరించారు.)